



# అదృష్టం

ఆంజనేయులు వచ్చిన పని పూర్తయింది. టైమ్ చూశాడు. ఆరున్నర. చీకటి పడుతోంది. రోడ్డుమీద నడుస్తున్నాడు. ఏదైనా ఆటో ఖాళీగా వస్తుంటే ఆపి స్టేషన్‌కి వెళ్లడమే. ఖాళీ ఆటో కనిపించడం లేదు. ఇప్పుడు పీక్ అవర్. అన్నీ జనాలతో నిండి వెళ్తున్నాయి.

అక్కడ రోడ్డు పక్కగా గంగరావిచెట్టు ఎత్తుగా పెరిగి ఉంది. దాని కింద అంతా చీకటి. చప్టామీద చిన్న పాప కూర్చుని ఉంది. ఎందుకో ఏడుస్తోంది. ఆంజనేయులుకి పాప ఏడుపు వినిపించింది. దారిన పోయేవాళ్లకి ఎందరికో ఆ ఏడుపు వినిపించి ఉండొచ్చు. ఎవరూ పట్టించుకోలేదు. మనకెందుకులే అనుకుని వెళ్లిపోతుండొచ్చు. కానీ ఆంజనేయులు అలా వెళ్లిపోలేదు.

పసిపాప. చీకట్లో కూర్చుని ఎందుకు ఏడుస్తోంది? కారణం ఏమై ఉండొచ్చు? తప్పిపోయి దిక్కుతోచక ఏడుస్తోందా?

"పాపా! ఎందుకేడుస్తున్నావ్?" ఆంజనేయులు దగ్గరకు వెళ్లి అడిగాడు.

పాప కుడిచేతిని ఎత్తి చూపించింది. ఆంజనేయులు చేతిని పట్టుకుని చూశాడు. చేతికి ఏదైనా దెబ్బ తగిలిందేమోనని పరీక్షించాడు. అటువంటిదేమీ కనిపించలేదు.

**వాణిశ్రీ**

కనిపించని దెబ్బ తగిలిందేమో? చెయ్యి బెణికిందేమో?

"దెబ్బ తగిలిందా?"

పాప "వుహూ" అన్నది తల అడ్డంగా ఊపుతూ.

"మరి ఎందుకేడుస్తున్నావు?"

"గాజు పోయింది" చెప్పింది పాప.

ఆంజనేయులు పాప ఎడమ చేతివైపు చూశాడు. దానికి ప్లాస్టిక్ గాజు ఉంది. అతనికి అర్థమైంది. కుడిచేతి గాజు పోగొట్టుకుంది పాప. అందుకు ఏడుస్తోంది.

"గాజు పోయిందా? పోతే పోయిందిలే. ఇంటికి పద. చీకటి పడిందిగా!" అనునయిస్తూ అన్నాడు ఆంజనేయులు.

"అమ్మ కొడుతుంది."

అదన్నమాట పాప ఏడుపుకి కారణం.

"మీ అమ్మకి నేను చెప్తాను. పద. మీ ఇల్లు ఎక్కడ?"

"గాజు...! వూ..వూ.." అని ఏడుస్తోంది పాప.

ఆంజనేయులుకి పాప ఏడుపు ఆపడం సాధ్యం కాలేదు. దూరంగా ఫ్యాన్సీ స్టోర్ కనిపిస్తోంది. అందులో గాజులు ఉండొచ్చు.

"పాపా! నీకు కొత్తగాజులు కొనిపెడతాను. ఇంటికి వెళ్తావా?"

పాప తల ఊపింది. ఆంజనేయులు పాప చేతిని పట్టుకుని నడిపించాడు. ఫ్యాన్సీ స్టోర్‌లో రెండు ప్లాస్టిక్ గాజులు కొన్నాడు. పాప చేతులకు తొడిగాడు.

పాప ముఖంలో సంతోషం కనిపిస్తోంది. ఆంజనే

యులుకి తృప్తిగా ఉంది.

"పాపా! మీ ఇల్లు చూపిస్తావా?"

పాప తల ఊపింది. ఆంజనేయులు పాప చేతిని పట్టుకుని నడవసాగాడు. ఏడు కావొస్తోంది. పసిపిల్ల చీకటి పడ్డాక గూడా ఇంటికి రాకపోతే, తల్లిదండ్రులు పట్టించుకోరా? తండ్రి పనుల మీద పోయినా, తల్లేం చేస్తోంది. ఏం మనుషులో?

అదంతా స్లమ్ ఏరియా! రేకుల షెడ్డులు, ప్లాస్టిక్ కవర్లు కట్టిన ఇళ్లు అన్నీ. పాప ఒక ఇంటి ముందు ఆగింది. ఇంటికి తాళం వేసి ఉంది. ఇంటి బైట మట్టి రోడ్డు పక్కన మురికి కాలువ దుర్గంధం వెదజల్లుతోంది.

పాప అటూ ఇటూ చూస్తోంది. కొందరు ఆంజనేయులు వైపు చూశారు గానీ పలకరించలేదు. ఎవరి దారిన వారు పోతున్నారు. ఒక పందిని నాలుగైదు కుక్కలు తరుముతున్నాయి. పంది గుర్రు గుర్రుమంటూ దూసుకు వస్తుంటే పాప భయపడుతూ ఆంజనేయులు కాళ్లను చుట్టుకుంది.

"భయం లేదులే! అవి వెళ్లిపోతాయి" అని పాప వీపు నిమిరాడు.

"ఇప్పటిదాకా ఎక్కడ చచ్చావే? వెతకలేక చస్తున్నాను."

ఆమె వస్తూనే పాప మీద విరుచుకుపడింది. అక్కడ ఆంజనేయులు లేకపోతే రెండు దెబ్బలు గూడా వేసి ఉండేది. ఆమె అతన్ని ఎగాదిగా చూసింది. పాప అతని చేతిని గట్టిగా పట్టుకుని తల్లి వైపు భయంగా చూస్తోంది.

"నువ్వేనా పాప తల్లివి?" అడిగాడు ఆంజనేయులు.

"ఔనండీ! మీరు?" అన్నది ఆమె.

ఆంజనేయులు జరిగింది ఆమెకు వివరించాడు.

"ఔనమ్మా! నిండా ఐదేళ్లు లేని పిల్లను అలా వీధిలో వదిలేస్తే ఎలా? అసలే రోజులు బాగా లేవు" మందలిస్తూ అన్నాడు.

"మా రోజులు బాగాలేవు అంకుల్! ఏవైనా జరగొచ్చు" అన్నది దిగులుగా.

"పాప తండ్రి ఏం చేస్తాడు?"

"పాప తండ్రా? హు.. ఉన్నా లేనట్లే!" నిట్టూరుస్తూ అన్నది.

"అదేం...?" అడిగాడు.

"మిమ్మల్ని వీధిలో నిలబెట్టి మాట్లాడుతున్నాను. లోపలకు రండి" అని తాళం తీసింది.

మంచం వేసి దుప్పటి పరిచి అతన్ని కూర్చోమన్నది. అది ఒకటే గది ఉన్న రేకుల షెడ్డు. ఇల్లంతా దరిద్రం తాండవిస్తోంది. ఆమె ముఖం దైన్యంతో నిండి ఉంది. ఆమెకు జీవితంలో ఏదో పెద్ద దెబ్బే తగిలి ఉంటుందని ఊహించాడు.

ఆమె నేలమీద కూర్చుని పాపను ఒడిలో పెట్టుకుంది.

"చెప్పమ్మా! ఏం జరిగింది? ఎవరో నిన్ను మోసం చేసి ఉంటారు."

ఆమెకు గతం గుర్తుకొచ్చింది కాబోలు, కళ్ల వెంట జరజరా కన్నీళ్లు రాలాయి.

"మాది బీద కుటుంబం. నేను ఎనిమిదో క్లాసు చదువుతుండగా మానిపించి పనికి పంపించడం మొదలుపెట్టాడు మా నాన్న. ఆటో తోలితే బాగానే డబ్బులొచ్చేవి. కానీ తాగుడుకే తగలేసేవాడు. మా అమ్మ ఇళ్లల్లో పనులు చేసేది. నేను చాలా పనులు చేశాను. ఇటుక బట్టీలో, బిల్డింగులకు ఇటుకలు మోసే కూలి పని వంటివి. నేను జిన్నింగ్ మిల్లులో పనిచేసేటప్పుడు మోహన్‌రావు నన్ను మాయ మాటలతో లొంగదీసుకున్నాడు. అతను జిన్నింగ్ మిల్లు ఓనరు కొడుకు. పెళ్లి చేసుకుంటానన్నాడు. ఆ వయసు వేడిలో నేను అతన్ని నమ్మాను. నాకు నెల తప్పాక కనిపించకుండా పోయాడు. మా నాన్న నన్ను ఇంట్లో నుంచి వెళ్లగొట్టాడు. మోహన్‌రావు ఇంటికి తీసుకెళ్లి మా అమ్మ గొడవ చేసింది. అతని తండ్రి మోహన్‌రావు బొంబాయి వెళ్లిపోయాడని చెప్పాడు. ఇప్పుడు చేసేదేం లేదని మా కుల పెద్దల్ని పిలిచి పంచాయతీలో కొంత డబ్బు ఇచ్చాడు."

## ప్చ్! సదా!!

సదా కెరీర్‌లో మంచి హిట్లున్నా కూడా అదేంటోగానీ చెప్పుకోదగిన సినిమాలు ఆమెకి రావడం లేదు. తొలిచిత్రం 'జయం', తమిళ చిత్రం 'అన్నియన్' (అపరిచితుడు) లాంటి బంపర్ హిట్‌లలో హీరోయిన్ అయినప్పటికీ ఒకటి రెండు సినిమాలే తప్ప కుప్పలుతెప్పలుగా ఆఫర్లు వచ్చిపడడం లేదు ఎందుకో మరి! అయితే తనకి దొరికే ఖాళీ టైంలో ఇప్పుడు సదా 'సల్సా' డాన్స్ నేర్చుకుంటోందిట. సల్సాలో స్పెషలిస్టుగా రాణించాలని ఆమె ఆలోచన కాబోలు. శుభం!



ఆమె జరిగిందంతా పూస గుచ్చినట్లు చెప్పింది.

"నీ పేరేమిటమ్మా?" అడిగాడు ఆంజనేయులు.

"యశోద."

"మోహన్‌రావు ఎలా ఉంటాడో నీ దగ్గర ఏదైనా ఫోటో ఉన్నదా?"

ఆమె తల ఊపింది. ట్రంక్ పెట్టె తెరిచి మోహన్ రావు ఫోటో చూపించింది.

"మోహన్‌రావు మీద పోలీసు రిపోర్టు ఎందుకివ్వ లేదు."

"ఎవరిస్తారు? మా అమ్మ వచ్చిన డబ్బు చాల్లే, బీద వాళ్లం. గొప్పవాళ్లతో గొడవ పెట్టుకుని బతకలేం అన్నది. నేను ఒంటరి ఆడదాన్ని. ఏం చేయగలను?" నిరాశతో యశోద నిట్టూర్చింది.

"డబ్బు ఇప్పించారు సరే! చిన్న వయసు నీది. ముందు ముందు ఎలా బతుకుతావు?"

"ఇలాగే చిన్న చిన్న పనులు చేసుకుంటూ నా కూతుర్ని పెంచుతాను. నా బతుకింతే."

"వయసులో ఉన్నావు. మళ్లీ ఎవరి చేతిలోనైనా మోసపోతే?"

"చచ్చినా ఏ మగాడ్నీ నమ్మను" దృఢంగా అన్నది యశోద.

"నిన్ను మోసం చేసిన మోహన రావు మీద నీకు కోపం లేదా?"

"ఎందుకు లేదూ! వుంది. కానీ ఏం చేయను? నావల్ల ఏమవుతుంది?"

"అవుతుంది. నువ్వు అధైర్యపడకు. అమాయకురాలైన నిన్ను మోసం చేసినవాడిని వదలకూడదు. ఎవరికి వాళ్లు మా ఖర్మ ఇంతే అనుకుంటే అటువంటి మోసగాళ్లకి అదుపు ఉండదు."

యశోద అతని వైపు ఆశ్చర్యంగా చూసింది.

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"నేను చెప్పినట్లు విను" అన్నాడు ఆంజనేయులు.

యశోద తల ఊపింది.

"అంకుల్! మీరు చెప్పినట్లు వింటాను" అన్నది.

* * *

ఆంజనేయులు యశోదను వెంటబెట్టుకుని యస్.పి. ఆఫీసుకి వెళ్లాడు. విజిటింగ్ కార్డు పంపించాడు. రమ్మని కబురు వచ్చింది. యశోదను విజిటర్స్ రూమ్‌లోనే కూర్చోబెట్టి యస్.పి. ఛాంబర్‌లోకి వెళ్లాడు.

కాసేపటికి యస్.పి. నుంచి యశోదకు కబురు వచ్చింది. ఆమె లోపలకు వెళ్లింది. యస్.పి. ఆమెను ఎగాదిగా చూశాడు. యశోద నమస్కారం పెట్టింది.

"కూర్చోమ్మా! భయపడకుండా జరిగింది మొత్తం చెప్పు" అన్నాడు ఆంజనేయులు.

యశోద జరిగింది అంతా చెప్పింది. ఆంజనేయులు ముందే డి.యస్పీని పిలిపించాడు. తర్వాత ఇన్‌స్పెక్టర్ వచ్చాడు. యశోదతో కంప్లైంట్ రాయించారు. మోహన్‌రావు ఫోటో తీసుకున్నారు. అతని మీద కేసు బుక్కయింది.



"బాబాయ్! మోహన్‌రావు కాంప్రమైజ్‌కి వచ్చి ఈమెను పెళ్లి చేసుకుంటే సరే! లేకపోతే జైలుకి పంపిస్తాం" అన్నాడు యస్పీ.

యశోద ముఖంలో ఆనందం తాండవిస్తోంది. ఆంజనేయులు ఆమె కళ్లకి దేవుడిలా కనిపిస్తున్నాడు.

"నువ్విప్పుడు ఒంటరిగా ఉండొద్దమ్మా! మీ నాన్నని పిలిపించి మాట్లాడతాను. ఇక నుంచి తల్లిదండ్రులతో కలిసి ఉండు. త్వరలోనే నీకు న్యాయం జరుగుతుంది" చెప్పాడు యస్.పి.

యశోద చెమర్చిన కళ్లతో చేతులు జోడించింది.

* * *

ఆంజనేయులు ఆటో దిగి ఇంట్లోకి వెళ్లేసరికి పార్వతి ఎదురొచ్చి "రాత్రే వస్తానన్నారు" అన్నది.

"మావాడింట్లో ఉన్నాను. రానిచ్చాడు కాదు" అని జరిగిందంతా చెప్పాడు ఆంజనేయులు.

"అలాగా! లేకపోతే మన కొంప మునిగేది. అంతా మన గోపిక అదృష్టం. వాడి కథంతా బైటపడింది. వామ్మో! ఎంత మోసం? చూట్టానికి బుద్ధిమంతుడిలా కనిపించాడు ముచ్చుమొఖం వాడు" అన్నది పార్వతి.

"అదృష్టమే! ఆ పాప ఏడుపు విని పట్టించుకోబట్టి తీగ లాగితే డొంక కదిలినట్లు అంతా బైటపడింది. లేకపోతే మోహనరావు మోసం తెలిసేది కాదు. ఏదో బొంబాయిలో జాబ్ చేస్తున్నాడని అనుకున్నాగానీ ఇటువంటి నీచుడని అనుకోలేదు" అన్నాడు ఆంజనేయులు.

"మీ అన్న కొడుకు పెద్ద యస్పీ కదా! మరి ఏం ఎంక్వయిరీ చేశాడు? ఫ్యామిలీ మంచిదని సర్టిఫికెట్ ఇచ్చాడుగా!" అన్నది పార్వతి.

"అందుకే వాడికి బాగా చీవాట్లు పెట్టాను. పోనీలే మన అదృష్టం. ఏదోలా ఆ మోసగాడి నుంచి తప్పించుకున్నాం. ఆ మోహన్‌రావు యశోదను పెళ్లి చేసుకోక తప్పదు. లేకపోతే జైలుకి పోతాడు" అక్కసుగా అన్నాడు ఆంజనేయులు.

"మనకంటే గూడా యశోదది అదృష్టం అనిపిస్తుంది నాకు. లేకపోతే ఇలా జరుగుతుందా? అంతా దేవుడి దయ" అన్నది పార్వతి.

## తమిళంలో ఫర్జానా

ముంబాయి నుంచి బాలీవుడ్‌కి వచ్చి అరడజనుపైగా సినిమాల్లో నటించిన ఫర్జానా ఇక్కడ చెప్పుకోదగిన బిజీ కాలేకపోయింది. సహజంగానే తన అదృష్టాన్ని ఇప్పుడు తమిళంలో పరీక్షించుకుంది. ఇప్పుడామెకి అక్కడ అవకాశాలు బాగానే వస్తున్నాయిట. ఎంతయిన కొత్తొక వింత కదా! తమిళ ప్రేక్షకులకు ఫర్జానా గ్లామర్ నచ్చినట్టే వుంది అని అంటున్నారు చెన్నయ్ సినీవాలాలు. మరో నమితలా ఫర్జానా కూడా తమిళనాట ఓ పూవు పూవుతుందా! ఏమో కాలమే జవాబు చెప్పాలి!